అంగరలో 25 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ నూతన భవనంలో శుక్రవారం ఆర్థోపెడిక్ వైద్య శిబిరంలో 25 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మండపేట ఆర్థోపెడిక్ వైద్యాధికారి డాక్టర్ కె. రాము వ్యాధులకు సంబంధించి వైద్య సేవలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.ఈ శిబిరంలో పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ పిఎన్ఎస్డి రత్నకుమారి, ఎంపిహెచ్ఇ .జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి. రామారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాము

డబ్బులిస్తేనే.. ఉచిత గ్యాస్.!

- తెల్లకార్డుదారుల్లో అర్హులందరికీ లబ్ధి
- జిల్లాలో ఏటా ప్రభుత్వంపై రూ.134 కోట్ల భారం

జిల్లాలోని ఏజెన్సీల ద్వారా 6,10,042 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజనలో జిల్లాలో 17,047 గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. గతేడాది నుంచి మళ్లీ ఆ పథకాన్ని పునరుద్ధరించి జిల్లాలో మరో 35 వేల కనెక్షన్లు మంజూరు చేశారు. ఉజ్వల్ యోజనలో కనెక్షన్ పొందినవారికి కేంద్ర ప్రభుత్వం రూ.300 రాయితీని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంది.

ప్రజాశక్తి - రాజోలు

ఔను.! సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగానే ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కానీ, డబ్బులు మాత్రం చెల్లించాలి. ఆదేంటి ఉచితంగా సిలిండర్లు ఇస్తున్నప్పుడు డబ్బులు ఎందుకు చెల్లించాలి? అనుకుంటున్నారా..! ఇందులోనే సర్కారు మెలిక ఉంది. ఉచిత సిలిండర్లకు కూడా ముందుగానే డబ్బులు చెల్లించాలి. ఆ తరువాత ఆ మొత్తాన్ని ప్రభుత్వం రీయింబర్స్గా చెల్లిస్తుంది. దీన్నిబట్టి నగదు బదిలీ పథకంలో భాగంగానే గ్యాస్ సిలిండర్లపై పూర్వం నుంచి ఉన్న రాయితీని కేంద్ర ప్రభుత్వం క్రమంగా తగ్గించిన చందంగా ఇందులోకూడా ఏదో ఒక మెలిక ఉంటుందని పేదలు భయపడుతున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం సూపర్-6 పథకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి నుంచి అమలు చేస్తామంటూ ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ప్రస్తుతం జిల్లాలో గ్యాస్ సిలిండర్ ధర రూ.820 వరకు ఉంది. ఈ మొత్తాన్ని లబ్ధిదారులు ముందుగానే చెల్లించాలి. డబ్బులే ఉంటే ఉచితం కోసం ఎందుకు ఆశ పడతామని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచితం అన్నాక ఉచితంగా ఇవ్వాలిగానీ ఇన్ని మెలికలు ఎందుకని జనం ప్రశ్నిస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా గ్యాస్ సిలిండర్ ధర మొత్తం చెల్లిస్తే రాయితీ మొత్తాన్ని తిరిగి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామంటూ ప్రకటించింది. తీరా ఆచరణలో సిలిండర్ ధర రూ.200 ఉన్న రాయితీని రూ.3 తగ్గించేసింది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల మాటూ అలాగే ఉందని పేదలు అంటున్నారు.

ప్రతి కుటుంబానికీ మేలు..

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించనున్న క్రమంలో ప్రతి కుటుంబానికీ మేలు జరగనుంది. జిల్లాలో ప్రస్తుతం గ్యాస్ బండ ధర రూ.831.50 (దూరాన్ని బట్టి ధర మారుతుంది)గా ఉంది. కేంద్ర ప్రభుత్వం సిలిండరుకు రూ.10.62 రాయితీపోను రూ.821.30 ప్రజలు భరించాల్సి వస్తోంది. సగటున నలుగురు సభ్యులున్న ఒక కుటుంబం ఎంత పొదుపుగా వాడినా రెండు నెలలకు మించి సిలిండర్ వచ్చే అవకాశం లేదు. కొన్ని కుటుంబాలకు నెలన్నరకే అయిపోతుంది. ఈ లెక్కన ఏడాదికి ఆరు అవసరం అవుతాయి. ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందించనుండడంతో ప్రజలపై సగం ఆర్థిక భారం తగ్గనుంది. ఇలా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.2494.50 ఆదా కానుంది.

రూ.134.40 కోట్లు ప్రభుత్వంపై భారం..

ఏడాదికి మూడు గ్యాస్ బండల చొప్పున వినియోగదారులకు అందించనున్న క్రమంలో రూ.134.40 కోట్లు ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. రేషన్ కార్డుల ప్రాతిపదికన చూసుకున్నా.. జిల్లాలో 5.39 లక్షల కార్డులు ఉండగా 16,17,375 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించాల్సివుంటుంది. వీటి విలువ రూ.134.40 కోట్లు కాగా ఈ భారమంతా ప్రజలకు తగ్గనట్లే.

అర్హులు ఎవరంటే..

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారు. వార్షికాదాయం గ్రామాల్లో..రూ.2 లక్షలకు, పట్టణాల్లో రూ.3 లక్షలకు మించని వారు. బియ్యం కార్డు కలిగి ఉండాలి. అర్హులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

24 గంటల్లో జమ

ఇందు కోసం విధి విధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రస్తుతం యాక్టివ్ ఎల్పీజీ కనెక్షన్ కలిగి ఉండి, తెల్ల రేషన్కార్డు, ఆధార్ లింక్ అయిన బ్యాంకు ఖాతా ఉన్నవారందరూ ఈ పథకానికి అర్హులేనని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఉచిత సిలిండర్లను కూడా లబ్ధిదారులు ఎప్పటిలాగే ముందుగా గ్యాస్ ధరను చెల్లించి సిలిండర్లు బుక్ చేసుకోవాలి. ఆ వెంటనే లబ్ధిదారుల మొబైల్కు శుభాకాంక్షలు చెబుతూ మెసేజ్ వస్తుంది. సిలిండర్ డెలివరీ అయిన 24 గంటల్లోపే గ్యాస్కు ముందుగా చెల్లించిన మొత్తం ఆయా గ్యాస్ కంపెనీల ద్వారా లబ్ధిదారుల ఆధార్కు లింక్ అయి ఉన్న బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

సచివాలయాల్లో..

ఈ తొలివిడత ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్లు వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగుతాయి. ఈలోపు ఎప్పుడైనా ఉచిత సిలిండర్లను పొందవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉచిత గ్యాస్ సిలిండర్ పొందాలనుకునే వాళ్లు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలి. అందుకుగాను లబ్ధిదారులు తమ గ్యాస్ ఏజెన్సీ దగ్గర గ్యాస్ కనెక్షన్ బుక్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డు(బియ్యం కార్డు) తో ఇకెవైసి చేయించుకోవాలి. ఇకెవైసి పూర్తి చేసుకున్న వారి డేటా 24 నుంచి 48 గంటల్లో అప్డేట్ అవుతుంది. ఇకెవైసి అప్డేట్ అయిన తర్వాత లబ్ధి దారుడి మొబైల్కు ఎస్ఎంఎస్ వస్తుంది. అనంతరం గ్యాస్ బుక్ చేసుకోవచ్చు. అలాగే గ్రామ వారీగా ఎన్పిసిఐ లింక్(బ్యాంక్ ఖాతా ఆధార్ లింక్) చేసుకోవాల్సిన వారి వివరాలు సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు.

వచ్చే రెండేళ్లలో 'పోలవరం' పూర్తి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆంధ్ర ప్రజల జీవనాడి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వచ్చే రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి జాతికి అంకితం ఇచ్చేందుకు ఎన్డిఎ కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం రామచంద్రపురంలో తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కుంటుపడిందన్నారు. ఎన్డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయన్నారు. 'పోలవరం'పై మాజీ సిఎం జగన్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. నిత్యావసరాల వస్తువుల ధరలు పూర్తి నియంత్రణలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అన్నారు. వైసిపి నాయకులు నిరాధార ఆరోపణలు మానుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రహదారులపై గోతులు పూడ్చేందుకు చర్యలు

జిల్లా రహదారుల, భవనాల శాఖ ఇంజినీర్ బి.రాము

ప్రజాశక్తి - అమలాపురం

ఆర్ అండ్ బి రహదారులను గోతుల రహిత రహదారులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా రహదారులు భవనాల శాఖ ఇంజనీర్ బి.రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆర్ అండ్ బి రహదారులు పై ఉన్న గోతులను పూడ్చేందుకు రూ.18 కోట్ల నిధులతో 71 పనులకు ఆమోదం లభించిందని.. సంబంధిత పనులను శనివారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ప్రజా ప్రతినిధులచే ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. మరో 72 పనులకు రూ.20 కోట్ల నిధులు మరో వారం రోజుల్లో మంజూరయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ పనులన్నింటినీ రానున్న జనవరి నెల నాటికి పూర్తి చేసి జిల్లాలో గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. శుక్రవారం అన్ని నియోజకవర్గాలలో ప్రారంభం కానున్న ఈ పనులను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పి .గన్నవరం మండలం పోతవరం గ్రామంలో లో శుక్రవారం ఉదయం ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

గోపి మూర్తి విజయానికి కృషి చేయాలి : ఎంఎల్సి ఐవి

ప్రజాశక్తి - ఐ.పోలవరం

త్వరలో జరగబోయే శాసన మండలి ఎన్నికలకు అన్ని వర్గాలవారు ఎంపిక చేసిన అభ్యర్థి బొర్రా గోపి మూర్తి విజయానికి కృషి చేయాలని పిడిఎఫ్ ఎంఎల్సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) కోరారు. ఐ.పోలవరం మండలంలో వివిధ గ్రామాల్లో ఉన్న జెడ్పి ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఎంఎల్సి ఐవి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి బలపరచాలని కోరారు. ఉపాధ్యాయల, విద్యా సమస్యలపై ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రతి సమస్యపై స్పదించి శాసన మండలిలో మాట్లాడే శక్తి గోపి మూర్తికి ఉందని వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన వెంట యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ సిహెచ్.కేశవరావు, మండల అధ్యక్షులు మట్టపర్తి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి పడమటి ఏడు కొండలు, వాకపల్లి శాస్త్రి,రేవు అప్పలస్వామి, జె.సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఎల్ సి ఐవి

భవిత కేంద్రంలో కోఆర్డినేటర్ పరిశీలన

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం ఎంపిపి పాఠశాలలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ సందర్శించారు. భవిత కేంద్రంలోని పిల్లల విద్యాసామర్థ్యాలను ఆయన పరిశీలించారు. పిల్లల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అలవెన్స్ నవంబర్ నెలలో విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంపులకు పిల్లలను తప్పకుండా తీసుకురావాలని సూచించారు. భవిత కేంద్రం రికార్డులను పరిశీలించి ప్రత్యేక అవసరాల గల ప్రతి పిల్లలు యు డైస్ లో తప్పక నమోదు అయ్యేటట్టు చూడాలని భవిత కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. గొల్లవిల్లి జెడ్పి ఉన్నత పాఠశాలను కాకినాడ జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఆకాడమిక్ మోనటరింగ్ అధికారి బి. రాంబాబు సహిత విద్య కో-ఆర్డినేటర్ సత్యనారాయణ సందర్శించారు.

ఎల్ఇడి అందజేస్తున్న సాయిరాం

మురమళ్ల ఆలయానికి ఎల్ఇడి బహూకరణ

ప్రజాశక్తి - ఐ.పోలవరం

మురమళ్ల: శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తుడు ఎల్ఇడిని శుక్రవారం బహూకరించారు. హైదరాబాద్కి చెందిన మాచిరాజు వెంకట సత్య సర్వేశ్వర సాయిరాం రూ.2 లక్షలు విలువ చేసే ఎల్ఇడిని ఆలయ కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణకి అందజేశారు. భక్తులు నిత్యకళ్యాణం లైవ్ తిలకించేందుకు వీలుగా ఉపయోగించనున్నారు.

ఇన్ఛార్జి ఎంపిడిఒగా రాజు నియామకం

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా ఫుల్ అడిషనల్చార్జ్తో ఇఒపిఆర్డిఒగా విధులు నిర్వహిస్తున్న ఎ.రాజు శుక్రవారం నియమితులయ్యారు. ఇంతవరకు ఎంపిడిఒగా పనిచేసిన కె.జాన్లింకన్ అక్టోబర్ 31న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఎంపిడిఒ (ఎఫ్ఎసి)గా రాజును నియమిస్తూ జిల్లా పరిషత్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయనను ఎంఎల్ఎ బండారు సత్యానందరావుతో పాటుగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు సెల్ఫోన్లో అభినందించారు.

బాధితులకు అండగా ఉంటా : ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి - మండపేట

మండలం ఏడిద లో జరిగిన ఘటనలో బాధితులకు న్యాయం జరిగే వరకూ తాను అన్ని విధాలా అండగా ఉంటానని మండపేట ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు తెలిపారు. మండపేట మండలం లోని ఏడిద గ్రామానికి చెందిన కాపు సామాజికవర్గీయుల చేతిలో దాడికి గురైన బాధితులను శుక్రవారం ఎంఎల్ఎ వేగుళ్ళ మండపేటలో వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించారు. కొల్లి చంటి, పాలపర్తి శేఖర్, బొత్స మోహన్ కిరణ్ లను కలిసి ధైర్యంగా ఉండాలని కోరారు. దోషులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించానన్నారు. నేరం చేసిన వారికి తగిన శిక్ష పడుతుందన్నారు. బాధితులను సిపిఎం జిల్లా సభ్యురాలు, సిఐటియు జిల్లా కోశాధికారి కృష్ణవేణి, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల, కె.కృష్ణవేణి

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

మండపేట దళిత యువకులపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, వారిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమలాపురంలోని ప్రజా సంఘాలు కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో తులసి రావు, కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గురువారం ఉదయం మండపేట సినిమా థియేటర్ వద్ద మోటార్ సైకిల్ పార్కింగ్ విషయంలో దళిత, కాపు యువకులు మధ్య జరిగిన చిన్న పాటి విషయాన్ని దష్టిలో పెట్టుకుని కుల అహంకారంతో ఉద్దేశ పూర్వకంగా కట్టేసి కొట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. వెంటనే దోషులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారని తెలిసిందని మరి కొంతమంది ఈ దాడుల్లో పాల్గొన్నట్టు సోషల్ మీడియాలో చెబుతున్నారని వారిని కూడా అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాయపడిన బాధితులు పాలపర్తి చంద్రశేఖర్, కొల్లు చంటి, బొత్స మోహన్ ,కిరణ్ లకు సరైన వైద్యం అందించాలని వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం లో లా అండ్ ఆర్డర్ వైఫల్యం పై దృష్టి పెట్టాలన్నారు. బాధితులకు న్యాయం చేయాలని ఇలాంటి సంఘటనలు పురావతం కాకుండా చూడాలన్నారు. చిన్న పాటి విషయాన్ని కుల ఉన్మాదంతో మండపేట నుంచి పాలపర్తి చంద్రశేఖర్, కొల్లు చంటి, బొత్స మోహన్, కిరణ్ అను ముగ్గురు దళిత యువకులను దౌర్జన్యంగా నాలుగు కిలో మీటర్లు ఏడిద గ్రామం వరకూ కాపు యువకులు తీసుకువెళ్లి, వినాయకుని గుడిలో వివస్త్రలను చేసి కట్టేసి కులం పేరుతో దూషించి కొట్టారన్నారు. ఈ సంఘటన నేటి సమాజలో అగ్రకుల అహంకార హేయమైన చర్యగా కెవిపిఎస్ భావిస్తోందనీ ఈ సంఘటనను ఖండిస్తుందన్నారు. దోషులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ అల్లవరం మండలం కన్వీనర్ గెడ్డం విజయ్కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పొలమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **రాజోలు** : మండపేట మండలం ఏడిద గ్రామంలో దళితులపై దాడి చేసిన దోషులను వెంటనే శిక్షించాలని దళిత చైతన్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా రాజోలు తహశీల్దార్కు దళిత చైతన్య వేదిక నాయకులు దళితులపై దాడి చేసిన దోషులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్కు పంపించాలని శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో మెమొరాండం ఇచ్చారు. దళితులపై దాడులు జరగడం పరిపాటిగా మారిందని, ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నప్పుడు దళితులు సమైక్యంగా ఉద్యమించాలని ఈ సందర్భంగా దళిత చైతన్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక నాయకులు బత్తుల మురళీకష్ణ, బత్తుల జనార్ధనరావు, మట్టా సురేష్, చిలకపాటి శ్రీధర్, విప్పర్తి సాయిబాబు, లిఖితపూడి బుజ్జి, మందపాటి మధు, చింతా మధుకుమార్, కలిగితి త్రిమూర్తులు, గొల్లమందల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలోని సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రాజోలు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత

ప్రభుత్వ భూముల కబ్జాపై కలెక్టర్కు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పంచాయతీ బడుగు పేటకు చెందిన ఒక వ్యక్తి ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేశాడంటూ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నకళ్ళను శుక్రవారం స్థానిక విలేకరులకు అందజేశారు. గ్రామంలో 2004 నుంచి 2009 వరకు ఇందిరమ్మ కాలనీలో ఒక్కొక్కరికి రెండు సెంట్ల చొప్పున 25 మంది లబ్ధిదారులకు ఇచ్చారన్నారు. రహదారులు తీసివేయగా మిగిలిన ఏడు సెంట్లు భూమి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించారన్నారు. కమ్యూనిటీ హాల్కు కేటాయించిన భూమిలో కొంత భూమిని ఆ వ్యక్తి కబ్జా చేసి అమ్మి వేశాడన్నారు. .అలాగే పలువురు లబ్ధిదారుల పేరును వచ్చిన పట్టా భూమి స్థలాలను దౌర్జన్యంగా ఆక్రమించి విక్రయించాడని పేర్కొన్నారు. కాలనీలో ప్రజావసరాలకు కేటాయించిన భూమిలో కొంత భూమిని ఆక్రమించి అమ్మి వేశాడన్నారు. అలాగే గ్రామంలో జగనన్న కాలనీ పేరుతో ప్రభుత్వం నాలుగు ఎకరాలు భూమి కొనుగోలు చేయగా ఆ భూమిలోను కబ్జా చేసి అవకతవకలకు పాల్పడ్డాడని అన్నారు. అలాగే గత నాలుగేళ్లగా కాలనీ చుట్టూ ప్రభుత్వ భూమిలో ఉన్న కొబ్బరి చెట్లనుంచి కొబ్బరి కాయల ఆదాయం అంతా స్వాహా చేస్తున్నాడని ఈ విషయమై పలుమార్లు స్థానిక తహశీల్దార్కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలోను ఫిర్యాదు చేశామని చర్యలు తీసుకోలేదని ఆ ఫిర్యాదుల పేర్కొన్నారు. ప్రభుత్వం ఎటువంటి చర్యలు ఆ వ్యక్తిపై తీసుకోకపోవడంతో అతని భూ అక్రమాలు మితిమీరాయని ఇప్పటికైనా అతనిపై విచారణ చేసి చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకొని ప్రజల శ్రేయస్సు కోసం ఉద్దేశించబడిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్కు గ్రామస్తులు నడింపల్లి సుబ్బరాజు, ఎన్. కొండబాబు, కుంచే మోహన్రావు, ఎంఎస్ఎస్ మూర్తి, బి.మోహన్ తదితరులు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇటుకల అపహరణపై ఎస్పికి ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని ఉట్రిమిల్లి గ్రామానికి చెందిన వానపల్లి దొరబాబుకు చెందిన ఇటుక బట్టీల నుంచి రూ.5 లక్షల విలువైన ఇటుకలు అపహరించకపోయారని, దీనిపై ద్రాక్షారామం పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గత నెల 29న జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై శుక్రవారం 'ప్రజాశక్తి'తో దొరబాబు మాట్లాడుతూ సుమారు 15 ఏళ్లుగా తాను లీజుకు తీసుకుని ఇటుకబట్టి నిర్వహిస్తున్నానన్నారు. రామానుజుల శేషగిరిరావు అతని అనుచరులు గత నెల అక్టోబర్ 28 నుండి తన ఇటుకలను ట్రాక్టర్లతోనూ, లారీలతోనూ తరలించకపోయారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదన్నారు. తనకు అన్యాయం జరిగిందని ఈ నేపథ్యంలో తాను అనారోగ్యానికి గురై రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని అన్నాడు. గత నెల 30న స్థానిక ఆర్డిఒ దీనిపై ఫిర్యాదు చేశామని తనకు న్యాయం చేయాలని దొరబాబు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.



వెల్లలో మద్యం షాపు తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలో వెల్ల గ్రామంలో ఉన్న మద్యం షాపు తొలగించాలని గ్రామస్తులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. వెల్ల నుంచి వెల్ల సావరం వెళ్లే రహదారిలో మద్యం షాపు పెట్టడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇక్కడ హైస్కూల్ కి వచ్చే విద్యార్థులు పట్ల మందుబాబులు వేధింపులకు గురి చేస్తున్నారని, సాయంత్రం అయితే మరింత రెచ్చిపోతున్నారని దీనితో మహిళలు ప్రయాణికులు భయ పడుతున్నారని ఆందోళన కారులు తెలిపారు. దీనిపై గ్రామస్తులంతా ధర్నా నిర్వహించారు. మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంటనే ఇక్కడ మద్యం షాపు తొలగించాలని నినాదాలు చేశారు. గ్రామానికి దూరంగా మద్యం షాపు ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆందోళనకార్లు ఆరోపించారు. వెంటనే మద్యం షాప్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చింతలపూడి కిషోర్ కుమార్, వాస బసవ కుమార్, నూకల భవాని శంకర్, జనసేన నాయకులు గాడా దుర్గాప్రసాద్, బొంతు కాళీ భగవాన్, కొరటాల సుబ్బారావు, మహిళా నాయకులు అల్లక సూర్యకాంతం, చింతపూడు దేవి, శలా అన్న పూర్ణ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వెల్ల మెయిన్ రోడ్డులో ధర్నా చేస్తున్న మహిళలు, గ్రామస్తులు

దోమల నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - మామిడికుదురు

లూటుకుర్రులో సర్పంచ్ అడబాల తాత కాపు పర్యవేక్షణలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించి దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు. ముంపు నీరు ఉన్న ప్రాంతాల్లో మురుగునీరు మళ్లించి బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ రాజు, పాలకవర్గ సభ్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి వారి లంక రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ చిన్నారావు

పంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ గ్రామ సభలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని కోరుమిల్లి, అద్దంకి వారి లంక, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సర్పంచులు ఆచంట సత్యనారాయణ, నాతి గవరయ్య అధ్యక్షతన జరిగిన సభల్లో తహశీల్దార్ పి.చిన్నారావు పాల్గొని మాట్లాడారు. రీ సర్వేలో పొరపాట్లను సరిదిద్దేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు .అనంతరం రైతుల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సాకా శ్రీనివాస్, కార్యదర్శిలు ఆర్ ఎస్ వి కామేశ్వరరావు,పి మోహన్, రెవెన్యూఅధికారులు, విఆర్ఒలు ,సచివాలయ సిబ్బంది ,రైతులు ,తదితరులు, పాల్గొన్నారు.

కార్యక్రమంలి కో కన్వీనర్, రాష్ట్ర ఎస్సి సెల్ నాయకులు

కె.పెదపూడిలో టిడిపి సభ్యత్వాల నమోదు

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట మండల పరిధిలో అత్యధికంగా టిడిపి సభ్యత్వాలు నమోదు చేయాలని నియోజకవర్గ కోకన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. కె.పెదపూడి నందెపువారిపాలెం లో గ్రామ శాఖ అధ్యక్షులు తిరుమనాథం హనుమంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, గ్రామ టిడిపి నాయకులు పెచ్చేట్టి శివ సత్య హరిబాబు, మంద రాజేష్, ఉందుర్తి పరంజ్యోతి, చిక్కం పల్లంరాజు, పితాని నాగరాజు, మోకా శ్రీనివాస్, పథ్వి శ్రీనివాస్, బల్ల బస్వరాజు, బండి అర్జున్, నేదునూరి సతీష్, బండి శ్రీను, నాందేపు వివి సత్యనారాయణ, తవిటికి దుర్గ, టిడిపి నాయకులు కార్యకర్తలు,పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రెండు గ్రూపుల ఘర్షణపై కేసు నమోదు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రాజపూడి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రెండు వర్గాల ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని గురువారం రాత్రి 7-00 గంటలకు రాజపూడి గ్రామములో రెండు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన సిహెచ్.అప్పల స్వామి ఇంటిముందు అదే గ్రామానికి చెందిన వేరే సామాజిక వర్గానికి చెందిన ఎస్.కె.కుమార్ అనే వ్యక్తి టపాసులు కాల్చుచుండగా చిన్న పిల్లలు ఇంట్లో ఉన్నారు, ఇంటిముందు టపాసులు కాల్చవద్దని చెప్పగా ఒకరితో ఒకరు వాగ్వివాదానికి దిగారు. దీంతో రెండు వర్గాల వారు చేరి గొడవలు పడి రాళ్ళు, కర్రలతో దాడి చేయగా ఆరుగురికి రక్తపు గాయాలు అయ్యాయి. స్థానిక సిహెచ్‌సికి చేర్పించినట్లు తెలిపారు. రెండు వర్గాల వారు మొత్తం 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని కొమరగిరి పంచాయతీ పరిధిలోని పంట పొలాల్లో నాటు సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నాటు సారాను కాస్తున్న వాసంశెట్టి వీరబాబును అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. బట్టీ వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, అలాగే నాటు సారా తయారీకి వినియోగించే 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వీర్రాజుపేటలో దీపావళి రోజున జరిగిన అగ్ని ప్రమాదంలో మాడా మల్లికార్జునరావుకు చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదం వార్త తెలిసిన వెంటనే స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీహరి జగన్నాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదం వల్ల ఇంటిలోని అన్ని వస్తువులు దగ్ధం కావడంతో కుటుంబీకులు కట్టుబట్టలతో మిగిలారు. స్థానిక వ్యాపారపుంత వీధికి చెందిన టిడిపి నాయకులు ఉల్లి సత్యనారాయణ బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేశారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని జేగురుపాడులో 40 ఏళ్ల వయసుగల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పంట పొలాల్లో గుర్తుపట్టలేని విధంగా ఉన్న వ్యక్తి మృతదేహం ఉందని జేగురుపాడు ఇందిరానగర్‌కు చెందిన వరసాల రత్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుని ఒంటిపై స్కై బ్లూ రంగు మీద నలుపు నిలువు చారలు చొక్కా, నైక్ పేరుగల నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, నీలం రంగు ప్లాస్టిక్ చెప్పులు ధరించి ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

వృద్ధురాలి మెడలో బంగారం అపహరణ

ప్రజాశక్తి - కాట్రేనికోన

వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలో బంగారాన్ని గుర్తతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ ఘటన మండలపరిధిలోని పల్లంకుర్రు గ్రామంలో గత నెల 30న చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కశిరెడ్డి నాగమణి, ఆమె భర్త శ్రీరాములు పల్లంకుర్రులో నివాసం ఉంటున్నారు. గత నెల 30న రాత్రి సమయంలో టివి చూస్తున్న వృద్ధురాలిని వెనక నుంచి రుబ్బురోలు పొత్రంతో ఆమెను గుర్త తెలియని వ్యక్తి తలపై కొట్టాడు. దీంతో ఆమె కేకలు వేస్తూ నేలమీద పడిపోయి స్పృహ కోల్పోయింది. ఈ సమయంలో ఆమె మెడలో ఉన్న పది కాసుల బంగారపు వస్తువులను ఆ వ్యక్తి అపహరించాడు. కేకలు విన్న భర్త శ్రీరాములు పక్క గది నుంచి వచ్చేటప్పటికే చోరీకి పాల్పడిన వ్యక్తి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం సిఐ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు పరిశీలించారు. దగ్గర్లోనే సిసి కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందుతుడిని తొందరలోనే పట్టుకుంటామని కాట్రేనికోన ఎస్ఐ అవినాష్ తెలిపారు. దీనిపై గత నెల 31న వృద్ధురాలి భర్త శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఈ సందర్భంగా ఎస్ఐ తెలిపారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

యానాం నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ముమ్మిడివరం ఎక్సైజ్ సిఐ ఎల్.చిరంజీవి తెలిపారు. వివరాలు ఇవి.. కొత్తపేట మండలం చిన్న గొల్లపాలెంకు చెందిన కేత శ్రీనివాసరావు శుక్రవారం యానాం నుంచి 6 బీరు సీసాలు, నాలుగు మద్యం సీసాలు తరలిస్తుండగా ఎదురులంక వారధి వద్ద అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుండి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే అన్నంపల్లి లో మరో వ్యక్తి యానాం మద్యం తరలిస్తుండగా టాస్క్ ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి పదకొండు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితుల పైనా కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు. నిందితులిద్దరినీ కోర్టుకు తరలించినట్లు సిఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని తోటపేట గ్రామంలో రెండు నెలలు నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గత నెల 31వ తేదీ రాత్రి ద్రాక్షారామ పోలీసులు దాడి చేశారు. రామచంద్రపురం సిఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అల్లం చంటి నిర్వహిస్తున్న సర్వీసింగ్ సెంటర్ వద్ద గల శిబిరంపై దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరు వద్ద నుంచి రూ.45,462 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ దర్యాప్తు చేస్తున్నారు.

దీపం-2 పథకం ప్రారంభం

అర్హులకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అర్హులైన కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు పథకం(దీపం-2) ప్రారంభమైంది. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ లో భాగమైన దీపం-2 పథకం కింద అర్హులైన కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇచ్చే కార్యక్రమాన్ని దీపావళి పండగ సందర్భంగా శుక్రవారం స్థానిక శ్రీదేవి గ్యాస్ ఏజెన్సీ నందు ప్రారంభించామని జరిగిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. స్థానిక వైపుణ్య దుర్గాదేవి ఇంటి నందు దీపం-2 పథకాన్ని మంత్రి గ్యాస్ పొయ్యి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ ఇప్పటికే వినియోగదారులు సిలిండర్లను బుక్ చేసుకుంటున్నారన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా శ్రీకాకుళం జిల్లా నుండి ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఇది ఎవరెవరికి వర్తిస్తుంది ఎప్పటి లోగా బుక్ చేసుకోవాలనే అంశాలపై యంత్రాంగం ప్రజలకు అవగాహన కలిపిస్తోందన్నారు. దీపం-2 పథకం కింద కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందనీ ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సిన అవసరంలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,47,000 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని ఆయన తెలిపారు. 2025 మార్చి 31 వరకు మొదటి సిలిండర్ బుకింగ్ కు అవకాశం ఉందన్నారు. సాధారణ పద్ధతిలోనే గ్యాస్ బుక్ చేసుకోవాలని, బుక్ అయినట్టు ఏజెన్సీ నుంచి మెసేజ్ వస్తుందన్నారు. అనంతరం ప్రభుత్వం నుంచి కూడా సందేశం వస్తుందనీ సిలిండర్ డెలివరీ సమయంలో మామూలుగానే పూర్తి సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే తదుపరి 48 గంటల్లో రాయితీ సొమ్ము గ్యాస్ కనెక్షన్కు లింక్ అయిన బ్యాంకు ఖాతాలో జమవుతుందన్నారు. ఉచిత సిలిండర్లకు అర్హులైనవారి ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ యాక్టివ్‌గా ఉండాలని, అలా లేకపోతే గ్యాస్ ఏజెన్సీలోనూ, లింక్ అయి ఉన్న బ్యాంకులోనూ ఇకెవైసి చేయించుకోవాలన్నారు. గ్యాస్ ఏజెన్సీలో ఇచ్చిన నెంబరు నుంచే సొంతంగా బుక్ చేసుకోవడం మంచిదన్నారు. ప్రస్తుతం ఉన్న ధరను సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారులు ఆ మొత్తాన్ని చెల్లించాక ప్రభుత్వం నుంచి రాయితీ రూపంలో ఆ మొత్తం బ్యాంకు ఖాతాలో పట్టణ ప్రాంతాలలో 24 గంటలు గ్రామీణ ప్రాంతాలలో 48 గంటలలో జమవుతుందన్నారు. ఈ పథకం కింద ప్రతీ నాలుగు నెలలకోసారి ఉచిత సిలిండరును లబ్దిదారులకు అందిస్తారన్నారు. మొదటి సిలిండర్ను 2025 మార్చి 31 లోపు ఎప్పుడైనా బుక్ చేసు కోవచ్చునన్నారు. రెండవ సిలిండర్ కొరకు జూలై 31 లోపు, మూడవ సిలిండర్ కొరకు నవంబర్ 30 లోపు బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కాల వ్యవధిలో ఒక్కొక్క ఉచిత సిలిండరును వినియోగించుకోవచ్చునన్నారు. ఈ పథకం కింద తెల్లరేషన్ కార్డు ఉన్న వారందరికీ ఉచిత సిలిండర్లు ఇస్తారనీ గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరున ఉన్నా పథకం వర్తిస్తుందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండరు పథకం పై ప్రజల్లో ఉన్న సందేహాల నివత్తికి క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా అవగాహన కలిపిస్తున్నామనీ గ్యాస్ ఏజెన్సీల నిర్వా హకులు, డెలివరీ సిబ్బంది ద్వారా కూడా వినియోగదారులకు తెలియజేస్తున్నారన్నారు. ఎవరికైనా పథకం అందకపోతే సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాలకుగాని, పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కార్యాలయంలోని రాష్ట్ర వినియోగదారుల సేవా కేంద్రంలోని 1967 టోల్ ఫ్రీ నంబరుకు గానీ ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాల వారి ఆర్థిక భారాన్ని తగ్గించాలనే సంకల్పంతో మూడు సిలిండర్లను ఉచితంగా అర్హులైన పేద కుటుంబాలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ దీపం-1, దీపం-2 పథకాలు తోపాటుగా డ్వాక్రా సంఘాలకు ఆర్థిక స్వాతంత్రత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కే దక్కుతుందని తెలిపారు. జెసి టి.నిషాంతి మాట్లాడుతూ దీపం-2 క్రింద పేద కుటుంబాల వారు ఆదాయాన్ని పెంచే దిశగా ఏడాదికి మూడు సిలిండర్లను పూర్తి రాయితీతో అందించడానికి ప్రభుత్వం సంకల్పించిందన్నారు. కార్యక్రమంలో మెట్ల రమణబాబు, జిల్లా పౌర సరఫరా అధికారి ఉదయ భాస్కర్, వార్డు మెంబర్లు , సత్యలక్ష్మి, వెంకటలక్ష్మి, నల్ల స్వామి, రామస్వామి, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.**కాట్రేనికోన:** రాష్ట్రంలో పేద ప్రజలు పడే కష్టాలు టిడిపి ప్రభుత్వం గుర్తించిందని దానికి అనుగుణంగా అభివద్ధి పనులను చేపడుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు పేర్కొన్నారు. దీపం 2 పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాట్రేనికోనలోని ఇండే న్ గ్యాస్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడారు. అనంతరం అర్హులైన లబ్దిదారులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సునీల్ కుమార్, వైస్ ఎంపిపి సానబోయిన నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, శీలం సూర్యనారాయణ, విత్తనాలు బుజ్జి, తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి:** మండలంలో అయినవిల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దీపం పథకం 2లో భాగంగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ చేతులు మీదుగా వినియోగదారులకు పంపిణీ చేశారు. తహశీల్దార్ నాగలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శివ శంకర్ ప్రసాద్, జెడ్పిటిసి సభ్యులు గన్నవరపు శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ కాకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **రాజోలు:** నియోజకవర్గంలో దీపం-2 పథకం ద్వారా 73,180 గ్యాస్ కనెక్షన్లకు లబ్ధి చేకూరనుందని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం రాజోలు మండల ప్రజా పరిషత్ కార్యలయంలో దీపం బి2 పథకం గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం ఎంపిపి కేతా శ్రీనువాస్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరక్టర్ పెదకాపు, ఎంపిడిఒ రాంబాబు, తహశీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, వైస్ ఎంపిపిలు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరావు, సర్పంచ్ రేవు జ్యోతి, నాయకులు గెడ్డం మహలక్ష్మీ ప్రసాద్, మోకా పార్వతి, చాగంటి స్వామి, గుబ్బల శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** మండపేట పట్టణంలో గ్యాస్ కంపెనీ వద్ద నిర్వహించిన ఉచిత గ్యాస్ సిలిండర్ దీపం-2 పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ వేగుళ్ల లీలా కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం దీపావళి పండుగ కానుకగా అర్హులైన లబ్ధిదారులకు మొదటి ఉచిత గ్యాస్ సీలిండర్లు వారి చేతుల మీదుగా అందజేశారు. **ముమ్మిడివరం:** మహిళా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలో గ్యాస్ ఏజెన్సీలైన ఇండెన్ మరియు హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీల కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఉచిత గ్యాస్ సిలండర్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఎంఎల్ఎ సుబ్బరాజు చేతులు మీదుగా లబ్ది దారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం :** ఎన్నికల హామీలను అమలు చేసి వాటిని నెరవేర్చడమే ఎన్‌డిఎకూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం శ్రీ కృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన దీపం పథకం-2 ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ప్రారంభ కార్యక్రమానికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, ఆర్‌డిఒ శ్రీకర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కూటమి నాయకులతో కలిసి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు, జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కెవి.సత్యనారాయణ రెడ్డి, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం

కార్యక్రమంలో పాల్గొన్న ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

రావులపాలెంలో సిలిండర్లు అందజేస్తున్న ఎంఎల్ఎ బండారు

బాధితులకు న్యాయం జరగకుంటే ఉద్యమం

ప్రజాశక్తి - మండపేట

మండపేట అట్రాసిటీ బాధితులకు పూర్తి స్థాయి న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు దిగుతామని ఎమ్ఆర్‌పిఎస్, మాల మహానాడు, రెల్లి సామాజిక వర్గాల రాష్ట్ర నాయకులు, ప్రజా పోరాట సంఘాల నేతలు ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ, ఆకుమార్తి చిన్న, వెంటపల్లి జాన్ మార్క్, నీలాపు వేంకటేశ్వరరావు, చీకట్ల వేంకటేశ్వరరావు, దూలి జయరాజు మాదిగ, సిఐటియు జిల్లా కోశాధికారి కృష్ణవేణి, బి.సిద్ధు తదితరులు హెచ్చరించారు. మండపేట మాదిగపేట లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. దళితులను అతి కిరాతకంగా నిర్బంధించి దుస్తులు తీసి మరీ కొడుతున్న వీడియో లు చూస్తుంటే హృదయం రగిలిపోతుందన్నారు. ఈ దారుణ ఘటనకు ఏడిద గ్రామం లోని వినాయకుని గుడి వేదిక కావడం మరింత బాధాకరమన్నారు. ఆ గుడి పెద్దలు అందరినీ ఈ కేసులో చేర్చాలన్నారు. అదే విధంగా నేరుగా దాడికి పాల్పడిన కొందరి పేర్లను పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ చేర్చలేదని ఆరోపించారు. రామిశెట్టి రాజా, రామిశేట్టి తేజ, కత్తుల రాజేష్, గణేష్ తదితరులు నేరుగా దాడికి పాల్పడ్డారని, వారందరి పేర్లను చేర్చాలని డిమాండ్ చేశారు. కిడ్నాప్, హత్యాయత్నం సెక్షన్ లను కేసులో చేర్చాలన్నారు. పోలీసులు తమకు హామీ ఇచ్చిన విధంగా సెక్షన్‌లు నమోదు చేయాలన్నారు. రేపటిలోగా సెక్షన్ లు నమోదు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా పోలీసు స్టేషన్ కు చేరుకుని పోలీసుల ముందు తమ డిమాండ్‌లను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చాపల వీరబాబు, కొవ్వాడ అప్పన్నబాబు, మందపల్లి దొరబాబు, ముమ్మిడివరపు నారాయణరావు, జక్కా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మండపేట లో మాట్లాడుతున్న దళిత, ప్రజా సంఘాల నేతలు

డిప్యూటీ సిఎంను కలిసిన 'వెన్నెల' తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఆలమూరు

స్కూల్ యాజమాన్యం వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని 'వెన్నెల' తల్లిదండ్రులు శుక్రవారం డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థిని వెన్నెల ఆత్మహత్య ఘటనను డిప్యూటీ సిఎంకు వివరించారు. మండలంలోని మడికి శివారు చిలకలపాడుకు చెందిన చెక్కపల్లి బాబి ద్వితీయ కుమార్తె వెన్నెల చెముడు లంక షిరిడి సాయి విద్యా నికేతన్ స్కూల్లో పదవ తరగతి చదువుతోంది. యాజమాన్యం దసరా సెలవులు ఇవ్వడం లేదని కలెక్టర్ కు తన తండ్రి సెల్ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసింది. దీనిపై ఆగ్రహించిన స్కూల్ యాజమాన్యం విద్యార్థి వెన్నెలను వేధింపులకు గురి చేయడంతో మనస్థాపానికి లోనై ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. దీనిపై తండ్రి స్థానిక అధికారుల మొదలుకొని జిల్లా కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరికి ఫిర్యాదులు అందజేసిన తమకు సరైన న్యాయం జరగలేదని ఆవేదన చెందుతూ శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎయిర్పోర్ట్ కు విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసి తమ గోడు ఆ కుటుంబం అంతా వెల్లబోసుకుంది. దీనిపై స్పందించిన పవన్ ఆ కుటుంబానికి 24 గంటల్లో న్యాయం జరగాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు విద్యార్థి వెన్నెల తండ్రి బాబి స్థానిక విలేకరులకు శుక్రవారం రాత్రి సమాచారం అందజేశారు.

డిప్యూటీసిఎం పవన్‌కు వివరాలు వెల్లడిస్తున్న వెన్నెల తల్లిదండ్రులు

కుండలేశ్వరంలో కార్తీక శోభ

ప్రజాశక్తి - కాట్రేనికోన

కుండలేశ్వరం గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతి సమేత కుండలేశ్వరం ఆలయం కార్తీక మాసం కావడంతో అత్యంత సుందరంగా విద్యుత్ దీపాలతో కళకళలాడుతోంది. నేటి నుంచి డిసెంబర్ రెండవ తేదీ వరకు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ కె.గంగాధర్ తెలిపారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన ఈ ప్రాంతానికి వేలాది సంఖ్యలో యాత్రికులు అనేక దూర ప్రాంతాల నుంచి వస్తుంటారని ఆలయ ఇఒ తెలిపారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామస్తులు ఆధ్వర్యంలో యాత్రికుల సహకారంతో కార్తీక మాసం అన్ని రోజులు దేవాలయానికి విచ్చేసే భక్తులందరికీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఆలయానికి ప్రత్యేకత ఉందని కాశి వెళ్లాలనుకునే యాత్రికులు ముందుగా కుండలేశ్వరం లోని ఈ దేవాలయాన్ని సందర్శించిన అనంతరమే కాశీ విశ్వేశ్వరుని దర్శించుకోవాలని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు చెబుతుంటారు.


దీపాలంకరణలో కుండలేశ్వరస్వామి ఆలయం

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - మామిడికుదురు

దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమనిడి డిసిసి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు నగరంలో గత నెల 31 ఆయన స్వగహం వద్ద. భారతరత్న ఇందిరా గాంధీ 40వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు ఆధ్వర్యంలో ఇందిరా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించినారు ఈ కార్యక్రమంలో పిసిసి నెంబర్ మహమ్మద్ ఆరిఫ్, మండల శాఖ అధ్యక్షులు అప్పన శ్రీరామకష్ణ, కొండేటి వెంకటేశ్వరరావు, బొంతు రాజేందర్, వానరాశి దుర్గారావు, ఎన్.వెంకటేశ్వరరావు, మట్ట సునీల్. తవిటికి వెంకటరమణ. విత్తనాల వెంకటేశ్వరరావు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


ఇందిరకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందజేస్తున్న పెయింటర్స్ కార్మిక సంఘ సభ్యులు

పెయింటర్ కుటుంబానికి సాయం అందజేత

ప్రజాశక్తి - కాట్రేనికోన

-మండల పరిధిలోని కందికుప్ప గ్రామానికి చెందిన పెయింటింగ్ కార్మికుడు మోకా శ్రీను ఇటీవల మరణించాడు. మృతుని కుటుంబానికి శ్రీ సూర్య పెయింటర్స్ కార్మిక సంఘం సభ్యులు ఆధ్వర్యంలో రూ.10 వేలు సాయం శుక్రవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో రేవు వెంకటరమణ, జగడం చినబాబు, వరసాల చిన్నా రావు, వజ్రపు సూర్య రమేష్, రేవు వెంకటరమణ, బొంతు రాంబాబు, అయితా బత్తుల మూర్తి, వాకపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

శివ సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి-కడియం

గెడ్డం శివ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన చిరు సేవా సమితి అధ్యక్షులు గెడ్డం శివ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ప్రియదర్శిని చెవిటి, మూగ ఆశ్రమంలో నిర్వహిస్తున్న దీపావళి సంబరాల్లో గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన సిటీ అధ్యక్షులు వై.శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పర్వదినాన వికలాంగులైన పిల్లలకు దీపావళి రోజున సంతోషాన్ని అందించాలని ఆలోచన రావడం నిజంగా అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సేవాసమితి సభ్యులను కోరారు. అనంతరం చిరు సేవా సమితి ఏర్పాటు చేసిన మిఠాయిలు, క్రాకర్స్‌ను పిల్లలకు అందించారు.

శ్రీనివాస్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సర్పంచ్‌గా తన గెలుపుకు విశేషంగా కృషి చేసిన గురజర్ల శ్రీనివాస్ ఆకస్మిక మరణం పట్ల దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ సంతాపం తెలిపారు. వైసిపిపై అభిమానంతో పార్టీ పటిష్టతకు, పంచాయతీ అభివృద్ధికి, వార్డు సభ్యులు, ఎంపిటిసిల గెలుపునకు కృషి చేసి, పార్టీలకతీతంగా అందరి మన్ననలు పొందిన శ్రీనివాస్ హఠాత్తుగా గుండెపోటుకు గురై, మరణించడం బాధాకరం అన్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, పలువురు గ్రామస్తులు శ్రీనివాస్ కుటుంబానికి సానుభూతి తెలిపారు. శ్రీనివాస్ భార్య గురజర్ల అరుణ కుమారి పంచాయతీ బోర్డు సభ్యురాలు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆర్‌డిఎస్ఎస్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పాలంగి సబ్ స్టేషన్ పరిధిలోని కె.సావరం గ్రామంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

చిక్కం రమేష్‌కు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన చిక్కం రమేష్‌ను శుక్రవారం ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఎ వెంట కూటమి నాయకులు ఉన్నారు.

ఓపెన్ ఇసుక రీచ్‌లకు అనుమతులు

ప్రజాశక్తి - సీతానగరం

శుక్రవారం మండలంలోని ఇసుక లభ్యతను బట్టి ప్రభుత్వం నుంచి రెండు ఓపెన్ ఇసుక రీచ్‌లకు అనుమతి వచ్చినట్లు సమాచారం. దీనిపై తహశీల్దారును వివరణ కోరగా వంగలపూడి ఇసుక రీచ్‌లో రెండు ర్యాంపులకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. సక్సెస్ బిడ్డింగ్‌లో పాన్ ఇండియా లిమిటెడ్, వాగ్దేవి వైష్ణవి సంస్థలు ఓపెన్ రీచ్‌లకు ప్రభుత్వం ద్వారా ఇసుక సరఫరా చేయడానికి అనుమతులు వచ్చాయని తెలిపారు. సాంకేతిక అనుమతులు వచ్చిన తర్వాత ఇసుక సరఫరాకు సిద్ధం అవుతాయని తెలిపారు.

క్రీడాకారులకు ప్రముఖుల అభినందన

ప్రజాశక్తి - అమలాపురం

స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో గత నెల 26, 27, 28 తేదీల్లో జరిగిన అంతర్ జిల్లా బాస్కెట్ బాల్ పోటీలు అండర్-17 విభాగంలో ఎంపికైన బాలబాలికలను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, డిఇఒ షేక్ సలీం భాషా అభినందించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్ నందు ప్రత్యేకంగా అభినందించారు. మహాత్మా గాంధీ మున్సిపల్ హై స్కూల్ అమలాపురానికి చెందిన కె.కుమార్ చంద్ శ్రీధర్ స్కేటింగ్ క్రీడలో జాతీయస్థాయిలో ఎంపికయ్యారన్నారు. అంబాజీపేట జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి నిమ్మకాయల సరిష్మ సాయి రుత్వి ఎంపికయ్యారన్నారు. గతంలో నిర్వహించిన అండర్ పోటీల విభాగంలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్య వహించారని జిల్లా కలెక్టర్ తెలుసుకొని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఇఒలు మధుసూదన్ రావు, సూర్య ప్రకాశం, స్కూలు హెచ్ఎం కామేశ్వరరావు, పీడీలు పి.సతీష్, ఆదిలక్ష్మి, క్రీడాభారతి ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు అభినందిస్తున్న కలెక్టర్

బాణసంచా పేలుడు ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని సూర్యారావుపాలెంలో బుధవారం పిడుగుపాటుకు దగ్ధమైన దీపావళి మందుల తయారీ ప్రాంతాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సంఘటనలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు అయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఫస్ట్ ఎయిడ్ క్యాంపును అయన సందర్శించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేలివెన్ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ సజన, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.కె.ఖాన్, ఎంఎల్‌హెచ్‌పి కళ్యాణి, మహిళా ఆరోగ్య కార్యకర్త పద్మావతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంఘటనా స్థలంలో పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

గడ్డివామి దగ్ధంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

తనపై కులవివక్షతో గడ్డివామి దగ్ధంచేశారని గొల్లవిల్లికి చెందిన మధుర బాబులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గొల్లవిల్లి సత్తెమ్మ గుడి సమీపంలో తాను వ్యవసాయ భూమిని కౌలుకు చేస్తున్నానని అన్నాడు. వ్యవసాయ భూమికి సమీపంలో గేదెలకు పాక గడ్డి వాము వేసుకున్నానని తెలిపాడు. దీనిని గ్రామానికి చెందిన గనిశెట్టి రాముడు వ్యతిరేకిస్తూ కులం పేరుతో దూషించాడని ఆ ఫిర్యాదుల పేర్కొన్నాడు. తన పైనా, తన భార్య బాలవేణిపైనా దౌర్జన్యం చేయడమే కాకుండా శుక్రవారం తెల్లవారుజామున గడ్డివామికి రాముడు నిప్పు పెట్టాడని పేర్కొన్నారు. పోలీసులు దర్యాప్తు జరిపి తనకు న్యాయం చేయాలని బాబులు ఆ ఫిర్యాదులు పేర్కొన్నాడు. ఘటనా స్థలాన్ని అమలాపురం నియోజకవర్గం బిఎస్‌పి ఇన్‌ఛార్జ్ పొలమూరి మోహన్ బాబు పరిశీలించి బాధిత కుటుంబానితో మాట్లాడారు. మోహన్ బాబు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఈ సంఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

PUBLIC NOTICE

This is to inform the general public that the statement of Marks and Pass certificate of ICSE Improvement Examination 2023 belonging to Gollapalli Srivalli Durga Jyothi (Unique ID : 7831717, Index Number : 1233181 / 030) who studied in St. Joseph's Convent School, Kakinada were received from the Council for the Indian School Certificate Examinations, New Delhi on 17-07-2024. Subsequently the said documents were misplaced in the St. Joseph's convent school, Jagannaickpur, Kakinada and till today they were not traced despite thorough search efforts made by the school, for which a complaint also has been lodged before I Town Police Station, Kakinada. Any person finding these above mentioned documents or having any information about them is requested to handover to the Head Mistress St. Joseph's Convent School, Church Square, Jagannaickpur, Kakinada or to the given address below mentioned.

Kakinada
30-10-2024

Karra Venu, Advocate.
D.No.6-3-30, Dantuvari Street,
Kakinada. Ph: 98495 48272